ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
మంగళవారం 16 సెప్టెంబరు 2025



కళాశాలల బంద్ విజయవంతం



- ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలి

8

ఇవి ప్రధానచౌరస్తాలో ఏఐఎస్ఎఫ్ నాయకుల నిరసన

పెన్షన్లు పెంచాలని ఆందోళన



- తహసీల్దార్లకు వినతిపత్రం అందజేత

8

తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న దివ్యాంగులు

ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి




ప్రజావాణి దరఖాస్తును పరిశీలిస్తున్న కలెక్టర్

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. కలెక్టర్, అదనపు కలెక్టర్ డి.వేణు తో కలిసి కలెక్టరేట్‌లో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన గట్టు భూమయ్య భూమిని కాంట్రాక్టర్ రెండు సంవత్సరాల అగ్రిమెంట్‌పై తీసుకున్నారని, గడువు ముగిసిందని ప్రస్తుతం తన భూమిలో రెండు వందల లారీల ఇసుక నిల్వ ఉందని, భూమి కౌలు ఇవ్వడం లేదని, తన సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా ఏడి మైన్స్‌కు రాస్తూ అవసరమైన చర్యలు వెంటనే తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన సైదం మహేష్ సర్వే నెంబర్ 42 లో గల 20 గుంటల భూమికి అసైన్మెంట్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ కు రాస్తూ అర్హతను పరిశీలించి నివేదిక అందించాలని కలెక్టర్ తెలిపారు. ఓదెల మండల కేంద్రానికి చెందిన నాగపురి రవి గ్రామ శివారులోని సర్వే నెంబర్ 1034లో గల నాలుగు ఎకరాలు 20గుంటల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని సాగు చేస్తున్నారని వీరిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ దరఖాస్తు చేయగా తహసిల్దార్ ఓదెల కు రాస్తూ విచారించి వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలలపై కరువైన పర్యవేక్షణ

- అస్తవ్యస్తంగా మారిన జిల్లా విద్యా శాఖ
- డీఈవోపై ఫిర్యాదులు వచ్చినా విచారణ కరువు



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లా విద్యాశాఖపై పలు ఫిర్యాదు వెల్లువెత్తుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి పలు అవకతవకలకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు వచ్చినా, విద్యార్థి, యువజన సంఘాలు ధర్నాలు చేసినా విచారణ జరపడంలేదు. డీఈవో అవకతవకలకు పాల్పడుతున్నారని పలువురు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు ఫిర్యాదు చేయగా, వరంగల్ ఆర్‌జేడీని విచారణకు ఆదేశించారు. రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఆర్‌జేడీ విచారణ జరపకపోవడం అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏ శాఖలోనైనా రెగ్యులర్ జిల్లా అధికారిగా మూడేళ్లు పూర్తయిన అనంతరం బదిలీ చేస్తుంటారు. కరీంనగర్ అసిస్టెంట్ డైరెక్టర్ మాధవి ఇక్కడ డీఈవోగా అదనపు బాధ్యతలతో నాలుగేళ్లుగా కొనసాగుతున్నారు. ఇక్కడ రెగ్యులర్ ఏడీ ఉన్నా కూడా డీఈవో అదనపు బాధ్యతలు ఇచ్చే అవకాశాలు ఉన్నా ఇవ్వడం లేదు. 2021 సెప్టెంబరు 15న కరీంనగర్ జిల్లా విద్యా శాఖలో ఏడీగా పని చేస్తున్న మాధవికి జిల్లా డీఈవోగా అదనపు బాధ్యతలను అప్పగించారు. అప్పటి నుంచి నాలుగేళ్లుగా డీఈవోగా కొనసాగుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడడం, జిల్లా కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సమన్వయం కొరవడిన కారణంగా జిల్లా విద్యా శాఖ అస్తవ్యస్తంగా మారింది. ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకోకుండా ప్రైవేట్ పాఠశాలలకు (మిగతా 8వ పేజీలో)



రామగుండం నవ నిర్మాణమే ధ్యేయంగా పని చేస్తున్నాం

రూ.5కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రామగుండం నవ నిర్మాణమే ధ్యేయంగా తాము పని చేస్తునామని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ పేర్కొన్నారు. రామగుండం నగరపాలక సంస్థ స్టాంప్ డ్యూటీ, ఇతర నిధులతో సుమారు రూ.5కోట్ల విలువైన అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. చంద్రబాబుకాలనీ, ఎన్‌టీపీసీ, గోదావరిఖని అశోక్‌నగర్‌లోని గర్ల్స్ హై స్కూల్‌లో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 186.5లక్షల నిధులతో ఆర్‌టీసీ, కేసీఆర్‌కాలనీ, పద్మావతికాలనీ, ఆర్‌కేగార్డెన్స్ ఏరియా, మార్కండేయకాలనీ, దుర్గానగర్, భవానీనగర్ ప్రాంతాలు, రూ.1.97 కోట్లతో ఫైటం క్లయిన్‌కాలనీ, రూ.కోటి నిధులతో అశోక్‌నగర్ బాలికల పాఠశాలలో అదనపుతరగతి గదుల నిర్మాణాలకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ రామగుండంలోని వివిధ ప్రాంతాలు దశాబ్దాలుగా సౌకర్యాలులేక అభివృద్ధికి నోచుకోలేదన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో నిధులు మంజూరు చేయించామన్నారు. రామగుండాన్ని వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చేసేందుకే రోడ్ల విస్తరణ చేపట్టామన్నారు.

పనులన్నీ తుది దశకు చేరుకుంటున్నాయన్నారు. దీన్ని ఓర్చుకోలేని కొందరు పూటకో పార్టీ మార్చే నాయకులు, ప్రజల్లో లీడర్‌గా గుర్తింపు ఉండాలనుకునే వారు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్‌కు ఇచ్చిన బంద్ పిలుపునకు గోదావరిఖని ప్రజలు వినూత్న రీతిలో జవాబు ఇచ్చారని, ఉదయం 11గంటలకు తెరవాల్సిన షాపులను 9గంటలకే తెరిచి సమాధానం చెప్పారన్నారు. కొత్తగా షాపింగ్ కాంప్లెక్స్‌ల నిర్మాణంతో ఉపాధి పెరుగుతుందన్నారు. అలాగే రెండు ఆసుపత్రి బ్లాక్, ఒక క్యాత్‌ల్యాబ్ నిర్మాణం పూర్తి కావస్తుందన్నారు. పీజీ కళాశాలను యూనివర్సిటీ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. నర్సింగ్ కళాశాలను అభివృద్ధి చేయడంతోపాటు రూ.200కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు కానున్నదన్నారు. అదనపు కలెక్టర్ అరుణశ్రీ, ఎస్ఈ శివానందం, డీఈలు షాబాద్, శాంతి స్వరూప, జమీల్, ఏఈ మీర్, ఎంఈఓ మల్లేషం, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొంతల రాజేష్, మాజీ కార్పొరేటర్లు మహంకాళి స్వామి, సాగంటి శంకర్, శంకర్ నాయక్, కొలిపాక సుజాత, నాయకులు సాంబమూర్తి, శ్రీనివాస్, రాజిరెడ్డి, గుంపుల ఓదెలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలులో పాలకుల కుట్ర



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) ఎస్సీ వర్గీకరణ అమలులో పాలకుల కుట్ర ఆగలేదని, మాలలకు అన్యాయం జరిగిందని మాల మహా నాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ పేర్కొన్నారు. పెద్దపల్లి ప్రెస్ క్లబ్ లో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మద్దెల నర్సయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన సుధాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి మాలలు వ్యతిరేకం కాదని, సామాజిక న్యాయం జరగటం లేదని విమర్శించారు. రోస్టర్‌విధానంవల్ల శాతవాహన యూనివర్సిటీలో 33 గెస్ట్ లెక్చరర్ పోస్టులు భర్తీలో ఒక్కరికి కూడా పోస్ట్ రాలేదని గుర్తు చేశారు. రోస్టర్ విధానంతో పిల్లల భవిష్యత్తు నాశనం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధానం వల్ల 22 స్థానంలో మాలలు ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం రోస్టర్ విధానం పై చర్చించి సవరణ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఎస్టీ చట్టాలు పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నారన్నారు. నవంబర్ 22న ఛలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడి అంజయ్య, ఉపాధ్యక్షుడు ఆశాది పురుషోత్తం, నాయకులు ఎలుక దేవయ్య, జై భీమ్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు కట్టికోల మధు, నాయకులు మాదాసి చందు పాల్గొన్నారు.

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు



వేణుగోపాల స్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలు

సుల్తానాబాద్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): వైష్ణవ కృష్ణాష్టమి పురస్కరించుకుని వేణుగోపాల స్వామి ఆలయంలో వేడుకలు వైభవంగా జరిగాయి. సోమవారం ఉదయమే స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పట్టణానికి చెందిన కొమురవెల్లి శ్రీనివాస్ అరుణ దంపతులు స్వామి వారికి రూ.60 వేల విలువగల ఇత్తడి తొడుగులను బహూకరించారు. సాయంత్రం నుంచి రాత్రి వరకు విశేష అలంకరణల మధ్య కృష్ణ గోదా అష్టోత్తారాలతోపాటు విష్ణు సహస్రనామా సామూహిక పారాయణం చేశారు. ఆలయ అర్చకులు సౌమిత్రి శ్రవణ్ కుమార్ హారిణి దంపతులు వైష్ణవ కృష్ణాష్టమి పండగ వైభవాన్ని వివరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించి ఆశీర్వచనాలు చేశారు. పలు రకాల నైవేద్యాలను స్వామి వారికి సమర్పించారు.

రామగుండంలో నియంతలా ప్రవర్తిస్తున్న ఎమ్మెల్యే

- బీఆర్ఎస్ పార్టీ బంద్ విఫలం చేసేందుకు వ్యాపారులకు బెదిరింపులు
- రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

పెద్దపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రామగుండంలో ఎమ్మెల్యే మాక్కాన్‌సింగ్ ఓ నియంతలా వ్యవహరిస్తున్నాడని, ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెడుతున్నారని, మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. సోమవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. విలేకరులతో ఆయన మాట్లాడుతూ లక్ష్మీనగర్‌లో వ్యాపారులను బెదిరింపులకు గురి చేస్తూ బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన బంద్‌ను విఫలం చేసేందుకు కుట్రలు చేశారని ఆరోపించారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో అభివృద్ధి పేరిట చిరు వ్యాపారుల దుకాణాలు కూల్చి వేస్తూ వారి జీవితాలను రోడ్డున పడవేశారని అన్నారు. దుకాణం దారులకు ఎలాంటి ముందస్తుగా సమాచారం ఇవ్వకుండా కూల్చివేస్తున్నారన్నారు. రోడ్డు వెడల్పు కోసం చేపడుతున్న ప్రణాళికలు ఇక్కడి ప్రజలకు వివరించాల్సిన అవసరం ఉందన్నారు. బీఆర్ఎస్ చేపట్టిన బంద్‌లో వ్యాపారులు పాల్గొంటే మరో ఐదు ఫీట్లు భవనాలను తొలగిస్తామంటూ బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. గాంధీనగర్ లక్ష్మీనగర్, ఎన్టీపీసీలో కూల్చివేసిన దుకాణదారులకు నష్టపరిహారం చెల్లించాలని, వారికి ప్రత్యామ్నాయ మార్గాలు చూపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాయకులు అయిలయ్య యాదవ్, మాజీ కార్పొరేటర్లు విజయ కల్వచర్ల కృష్ణవేణి, బాదె అంజలి, నాయకులు బోడ్డు రవీందర్, బోడ్డుపల్లి శ్రీనివాస్, ఆర్నపల్లి శ్రీనివాస్, మేడి సదానందం, నూతి తిరుపతి, మెతుకు దేవరాజ్, శ్రీనివాస్, ముద్దసాని సంధ్యా రెడ్డి, వెంకటేష్, వెంకటస్వామి, రామరాజు ఉన్నారు.

ఎస్ఐఆర్ నిర్వహణకు అధికారులు సన్నద్ధంగా ఉండాలి

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ (ఎస్ఐఆర్) నిర్వహణకు అధికారులు సన్నద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సూచించారు. సోమవారం స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ 2002 కలెక్టర్లతో రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈవో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ పాల్గొన్నారు. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఓటర్ జాబితా 20 నుంచి 25 సంవత్సరాలకు ఒకసారి ఎస్ఐఆర్ చేస్తారని, రాష్ట్రంలో 2002లో చేశారన్నారు. మాస్టర్ ట్రైనర్ల ద్వారా బూత్‌స్థాయి సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. ఆర్డీవోలు గంగయ్య, సురేష్, పాల్గొన్నారు.

సంచార చేపల విక్రయ వాహనంతో ఉపాధి



లబ్ధిదారులతో ఎమ్మెల్యే విజయరమణారావు

ఎలిగేడు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): చేపల సంచార వాహనం ద్వారా విక్రయాలు సులభతరమవుతుందని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. సోమవారం శివపల్లిలో ఓదెల మండలంలోని గూడెం గ్రామానికి చిట్ల అర్చన ఇందిరా మహిళశక్తి పథకంలో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా రూ.10.60 లక్షల సబ్సిడీతో మంజూరైన చేపల సంచార వాహనాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యరంగానికి, ముదిరాజ్ కులస్తులకు పెద్దపీట వేస్తుందని తెలిపారు. డీఆర్‌డీఏ ద్వారా అనేక వ్యాపారాలు చేసుకునేందుకు అవకాశం ఉందని, దానిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. జిల్లా మత్స్యసహకార సంఘం డైరెక్టర్ శ్రీనివాస్, డీఆర్‌డీఏ అధికారి రవి, మత్స్యశాఖ అధికారి నరేష్ పాల్గొన్నారు.

భూగర్భ జలాల వృథా నియంత్రణకు చర్యలు

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) జిల్లాలో భూగర్భ జలాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన జిల్లా భూగర్భ జలాల కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో అధికంగా భూగర్భ జలాలను వాడుతున్న గ్రామాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి విస్తృత ప్రచారం చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఉన్న అన్ని పరిశ్రమలు విధిగా భూగర్భ జల శాఖ నుంచి అనుమతి పొందేలా చూడాలన్నారు. జిల్లా భూగర్భ జిల్లా అధికారి లావణ్య, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం.కాళిందిని, జిల్లా విద్యాశాఖ అధికారి డి. మాధవి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. సోమవారం మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంసిహెచ్‌లోని ఔట్ పేషెంట్ బ్లాక్‌లు, ఆపరేషన్ థియేటర్ లు, గర్భిణి స్పెషల్ వార్డులు, చిన్న పిల్లల వార్డులను, ల్యాబ్, మందుల పంపిణీ కేంద్రంను కలెక్టర్ పరిశీలించారు. మాట్లాడుతూ, ఆసుపత్రిలో పారిశుధ్య నిర్వహణ మరింత మెరుగ్గా ఉండాలని, ఔట్ పేషెంట్ సేవల సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్, పూలే ఆశయసాధనలో బహుజనులు ముందుండాలి



మాట్లాడుతున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

కమాన్‌పూర్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్, పూలే ఆశయ సాధనలో బహుజనులు ముందుండాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. సోమవారం పెంచికల్‌పేటలో పుట్టలింగమ్మ చారిటబుల్ ట్రస్టు, ఏఐఎమ్‌వైఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇలుగురాళ్ల కిష్టయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈశ్వర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని రచించిన అంబేద్కర్ చొరవతో అన్ని వర్గాల వారికి హక్కులు దక్కాయన్నారు. అలాంటి మహనీయుడి విగ్రహం ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. పుట్ట మధు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 20 నెలల్లో ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, రాబోయే రోజుల్లో అధికారం తమ చేతుల్లోకి వస్తుందన్నారు. నియోజకవర్గంలో ఎన్నో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నా పోలీసు అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదన్నారు. దుద్దిళ్ల శ్రీధర్ బాబు తమ్ముడు శ్రీను బాబు చేస్తున్నా, అధికారులు స్పందించడం లేదన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాత కక్షల నేపథ్యంలో హత్యకు పాల్పడ్డ ఇద్దరికి జీవితఖైదు జైలు శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.7 వేలచొప్పున జరిమానా విధిస్తూ ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి నారాయణ సోమవారం తీర్పు వెలువరించారు. వెల్గటూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎండపల్లి గ్రామానికి చెందిన అంకం మల్లేశం, రాజేశంకు అదే గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణకు మధ్య పాతకక్షలు ఉన్నాయి. రాజేశంతోపాటు అతడి అత్తమ్మ సరస్వతిని పాతపగల నేపథ్యంలో లక్ష్మి నారాయణ దాడికి పాల్పడగా కేసు నమోదయింది. మల్లేశం, రాజేశంలతోనే తనపై కేసు నమోదు అయ్యిందనే కోపంతో లక్ష్మీనారాయణ కక్ష పెంచుకున్నాడు. 2016సెప్టెంబరు 9న మల్లేశంను ఎలాగైనా చంపాలనే ఉద్దేశ్యంతో లక్ష్మీనారాయణ అతని భార్య విజయలు ఇద్దరు కలిసి కళ్లలో కారం పొడి చల్లి గొడ్డలితో దాడి చేయగా మల్లేశంకు తీవ్ర గాయాలుకాగా అడ్డువచ్చిన రాజేశంపై దాడికి పాల్పడ్డారు. తీవ్రగాయాలైన మల్లేశంను కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదుమేరకు అప్పటి ఎస్సై వెంకటేశ్వర్ రావు కేసు నమోదు చేయగా సీఐ మహేష్ దర్యాప్తు చేశారు. నిందితులైన లక్ష్మి నారాయణ, విజయలను కోర్టులో హాజరు పరుచగా సీఎంఎస్ ఎస్సై శ్రీకాంత్, కోర్టు డ్యూటీ అధికారులు శ్రీధర్, రాజు, కిరణ్ కుమార్‌లు సరైన సాక్ష్యులను కోర్టులో ప్రవేశ పెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ కేసు వాదించగా నేరంరుజువు కావడంతో ఇద్దరు ముద్దాయిలకు శిక్షవిధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. నిందితులకు శిక్షపడడంతో కృషిచేసిన పోలీస్ అధికారులను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

ఒకరిపై అట్రాసిటీ కేసు నమోదు

ఇల్లందకుంట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఓ వ్యక్తిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఇల్లందకుంటకు చెందిన మోత్కురి సారయ్య గేదెలను మేపడానికి ఓ ప్రదేశానికి వెళ్లగా ఇదే గ్రామానికి చెందిన ఒద్దుల సతీష్‌రెడ్డి ఇక్కడ నా గేదెలు మేస్తాయని ఇటువైపు నీవు గేదెలను తోలు కొని రావద్దని కులం పేరుతో దూషించాడు. సారయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు సతీష్‌రెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు.

లోక్ అదాలత్‌లో 15మందికి శిక్ష

తిమ్మాపూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈమధ్య జరిగిన లోక్‌అదాలత్‌లో భాగంగా మండలంలోని ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్ పరిధిలో 15 ఇసుక అక్రమ రవాణా కేసుల్లో ఎక్సైజ్ మేజిస్ట్రేట్ బానోత్ రాజేశ్వర్ ఒక్కొక్కరికి ఎనిమిదివేల రూపాయల జరిమా నాలతో పాటు ఒకరోజు ప్రభుత్వ కార్యాలయాల్లో స్వచ్ఛ భారత్ చేపించామని ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

గన్నేరువరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా కనుగొని బాధితుడికి సోమవారం అందించినట్లు ఎస్ఐ నరేందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన పెంటి నర్సయ్య తన సెల్‌ఫోన్ పోగొట్టుకున్నానని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా 24గంటల్లో కనుగొని ఫోన్‌ని తనకి అందించినట్లు తెలిపారు.

25 ఏళ్లుగా పిల్లర్లకే పరిమితం

అసంపూర్తిగా రంగపేట ఆర్టీసీ బస్ షెల్టర్

మానకొండూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగపేట ఆర్టీసీ బస్ షెల్టర్ 25 ఏళ్ల గా పిల్లర్లకే పరిమితం అయింది. మండలంలోని రంగపేట గ్రామంతో పాటు మరో ఎనిమిది గ్రామాలు కమలాపూర్ అసెంబ్లీ నియోజకవర్గం, హన్మకొండ పార్లమెంట్ నియోజకవర్గంలో కొనసాగేవి. టీడీపీ హయంలో కమలాపూర్ ఎమ్మెల్యే ముద్దసాని దామోదర్‌రెడ్డి మంత్రిగా కొనసాగారు. రంగపేట గ్రామానికి ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సు లేకపోవడంతో కరీంనగర్-జమ్మికుంట ప్రధాన రహదారి నుంచి రంగపేటకు మూడు కిలోమీటర్ల దూరం.

ఇక్కడ దిగిన ప్రయాణికులు గ్రామానికి కాలినడకన వెలుతుండేవారు. ఆర్టీసీ బస్సు వచ్చేంత వరకు గ్రామస్థులు ఎండలో ఎండుతూ, వానలో తడుస్తూ ఉండేవారు. గ్రామానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ముద్దసాని దామోదర్‌రెడ్డి మంత్రి కావడంతో గ్రామస్థుల కోరిక మేరకు బస్‌షెల్టర్ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. అదే గ్రామానికి చెందిన గోపు ఆనందరెడ్డి అనే వ్యక్తి బస్ షెల్టర్ నిర్మాణం చేపట్టి పిల్లర్ల వరకు పూర్తి చేశాడు. నిధులు మంజూరు కాకపోవడంతో పనులు నిలిచిపోయాయి.



చెట్ల మధ్యన కనిపిస్తున్న బస్టాండ్ కోసం నిర్మించిన పిల్లర్లు

అప్పటి నుంచి 25 ఏళ్లుగా పిల్లర్లకే పరిమితం అయిందని గ్రామస్థులు వాపోతున్నారు. అసంపూర్తి బస్ షెల్టర్‌లో చెట్లు మొలిచి వృక్షాలుగా మారాయి. ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకొని బస్సు షెల్టర్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కిక్ బాక్సింగ్‌లో జిల్లా విద్యార్థినులకు పతకాలు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : అస్మితా ఉమెన్స్ కిక్‌బాక్సింగ్ ఆధ్వర్యంలో ఖేలో ఇండియా ఉమెన్స్ బాక్సింగ్ రాష్ట్రస్థాయి పోటీలలో రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన విద్యార్థినిలు రెండు రజత పతకాలు సాధించారు. సోమవారం వరంగల్ జిల్లా కేంద్రం మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఖేలో ఇండియా ఉమెన్స్ కిక్ బాక్సింగ్ పోటీలలో జిల్లాకు చెందిన లింగం శ్లోకా, అన్నాల్‌దాస్ లక్ష్మిప్రసన్న వివిధ విభాగాలలో పోటీ పడి ప్రత్యర్థులను చిత్తు చేసి ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకాలను సాధించారు. రజత పతకాలను సాధించిన శ్లోకా, లక్ష్మిప్రసన్నలకు కిక్ బాక్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రామాజంనేయులు కార్యదర్శి మహిపాల్, కోశాధికారి పన్నీరు శ్రీనివాస్ రజత పతకా లను అందించి అభినందించారు. రజత పతకాలను సాధించిన చిన్నారులను కిక్ బాక్సింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మాస్టర్ వొడ్నాల శ్రీనివాస్, జిల్లా కోచ్ యేనగందుల శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోతీలాల్ ఉపాధ్యాయులు అభినందించారు.



సాధించిన రజత పతకాలతో విద్యార్థినులు

నిమ్మనపల్లిలో చోరీ

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నిమ్మనపల్లి గ్రామానికి చెందిన వేల్పుల కనుకయ్య సింగరేణి రిటైర్డ్ కార్మికుడు. అతడు ఇరవై రోజుల క్రితం మంచిర్యాలలోని కుమారిడి ఇంటికి వెళ్ళాడు. ఆదివారం ఇంటి ప్రహరీ కూలిపోవడంతో స్థానికులు కనుకయ్యకు సమాచారం ఇచ్చారు. సోమవారం అతను వచ్చి చూసేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండటంతో పోలీసులకు తెలిపారు. రూరల్ ఎస్ఐ మల్లేష్, క్లూస్ టీం బృందంతో తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఇంట్లో ఎంతవరకు చోరీ జరిగిందనేది ఎలాంటి ఫిర్యాదు రాలేదని, సంఘటనపై విచారణ చేపడుతున్నట్లు రూరల్ ఎస్ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో హోంగార్డు ఆత్మహత్య



కనకయ్య(ఫైల్)

చొప్పదండి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుక్మాపూర్ గ్రామానికి చెందిన ముద్దసాని కనకయ్య(46) అనే హోంగార్డు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై కథనం ప్రకారం.. కమిషనరేట్ హెడ్‌క్వార్టర్స్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న ముద్దసాని కనకయ్య ఆర్థికఇబ్బందులతో బాధపడుతూ ఆదివారం రాత్రి గ్రామశివారులో క్రిమిసంహారక మందు తాగాడు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు చికిత్సనిమిత్తం కరీంనగర్ సివిల్‌ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో కనకయ్య మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. హోంగార్డు కనకయ్య మృతదేహానికి రిజర్వ్‌డీఎస్పీ భీంరావు నివాళులర్పించి తక్షణ సహాయంకింద రూ.20వేలు అందజేశారు.

వృద్ధురాలి బలవన్మరణం

వేములవాడ, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని భగవంతరావునగర్‌కు చల్లా లక్ష్మి(75) అనేవృద్ధురాలు ఉరివేసుకుని సోమవారం బలవన్మరణానికి పాల్పడింది. ఆమెకు ఇద్దరు కుమారులు ఒక కుమార్తె ఉండగా ఆరుసంవత్సరాల క్రితం భర్త చనిపోవడంతో లక్ష్మి ఒంటరిగా ఉంటున్నట్లు బంధువులు తెలిపారు. వృద్ధాప్యంతో పాటు ఒంటరిగా ఉంటున్న ఆమె మానసికస్థితి తట్టుకోలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. పెద్దకొడుకు గంగాధర్ తనతల్లి మృతిపై అనుమానాలు ఉన్నాయని పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ వీరప్రసాద్ తెలిపారు.

ఆటో డ్రైవర్ దారుణ హత్య

జగిత్యాల రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని సుతారిపేటకు చెందిన ఆటోడ్రైవర్ ఎండీ నయిముద్దీన్ (50) ఆదివారం అర్థరాత్రి దారుణహత్యకు గురైనట్లు జగిత్యాలరూరల్ సీఐ సుధాకర్ తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు హత్యచేసి జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస-గుల్లపేట బైపాస్‌రోడ్డు సమీపంలోని కాల్వలో పడేశారు. మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనస్థలానికి చేరుకొని పోలీసులు హత్యకుగల వివరాలు సేకరించారు. మృతుడు నయిమొద్దీన్ హత్యకు గురైన రోజు రాత్రి సమయంలో అతడిఆటోలో ముగ్గురువ్యక్తులు ఎక్కి జగిత్యాల పట్టణంలో తిరిగినట్లు పోలీసులుగుర్తించారు. సీసీపుటేజీలద్వారా అనుమానిత వ్యక్తులను గుర్తిస్తున్నామని త్వరలోనే నిందితులను పట్టుకుంటామని సీఐ తెలిపారు. మృతుడుసోదరుడు ఇషాక్‌ఉద్దీన్ ఫిర్యాదుమేరకు హత్య కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని జగిత్యాలరూరల్ సీఐ తెలిపారు.

రూ.7300 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, సెప్టెంబర్ 15 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట వ్యవసాయమార్కెట్లో క్వింటాల్ పత్తిధరరూ.7300పలికింది. సోమవారం మార్కెట్‌యార్డుకు ముగ్గురు రైతులు 45క్వింటాళ్లవిడిపత్తి, 9మందిరైతులు 58క్వింటాళ్ల కొత్తపత్తి, ఆరుగురు రైతులు 14క్వింటాళ్ల గోనెసంచుల్లో విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్‌ట్రేడర్స్ బహిరంగవేలం పాటద్వారా గరిష్ఠధర రూ.7300,కనిష్ఠధరరూ.4వేలు చెల్లించిపత్తి కొనుగోళ్లు చేపట్టారు.

యువకుడిపై కత్తితో దాడి: తీవ్ర గాయాలు

మెట్‌పల్లిటౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలో ఏనగందుల గణేష్ అనే యువకుడిపై ఆదివారం రాత్రి ఇద్దరు వ్యక్తులు కత్తితో దాడి చేయగా తీవ్రగాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మెట్‌పల్లి ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మెట్‌పల్లి బస్ డిపో వద్ద ఆదివారం రాత్రి పట్టణానికి చెందిన ఏనగందుల గణేష్ అనే యువకుడితో జగిత్యాలకు చెందిన రాజేశ్వర్ అనే వ్యక్తికి ఓ ద్విచక్రవాహనానికి సంబంధించి 5వేల రూపాయల కోసం వాగ్వాదం జరిగింది. దీంతో రాజేశ్వర్‌తోపాటు నిఖిల్ అనే వ్యక్తి గణేష్‌ను కత్తితో పొడవగా తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చి గణేష్‌ను మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి తండ్రి ఏనుగందుల సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాపాలన దినోత్సవంలో పతాకావిష్కరణకు ఇన్‌చార్జిల నియామకం

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం 17న జరపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు కరీంనగర్ ఉమ్మడిజిల్లాల్లో జాతీయ పతాకావిష్కరణకు మంత్రులు, ప్రభుత్వవిప్, కార్పొరేషన్ చైర్మన్లను ఇన్‌చార్జిలుగా నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కరీంనగర్‌లో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనార్టీశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు జాతీయపతాకావిష్కరణ చేయనున్నారు. జగిత్యాలకు తెలంగాణ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ కమిషన్‌చైర్మన్ నిరంజన్, పెద్దపల్లికి రాష్ట్ర మైనార్టీస్ ఫైనాన్స్‌కమిషన్ చైర్మన్ మహ్మద్ ఒబెదుల్లా కొత్వాల్ సాహెబ్, రాజన్న సిరిసిల్ల జిల్లాకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను నియమించారు. ఈ మేరకు వీరు ఈనెల17న తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జిల్లాకేంద్రాల్లో ఉదయం 10గంటలకు జాతీయపతాకాన్ని ఎగురవేయనున్నారు.

శ్రీరాంసాగర్‌కు పెరిగిన ఇన్‌ఫ్లో

- 36 గేట్లు ఎత్తి 1,47,000 క్యూసెక్కులు దిగువకు విడుదల

జగిత్యాల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్‌కు సోమవారం ఇన్‌ఫ్లో పెరిగింది. 36 గేట్లు ఎత్తి 1,47,000 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటినిల్వ సామర్థ్యం 80.5టీఎంసీలకు గాను ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వరదకాలువకు 8,000క్యూసెక్కులు, కాకతీయ కాలువకు4,000, సరస్వతీకాలువకు 800క్యూసెక్కులువిడుదలవుతోంది.



దిగువ గోదావరిలోకి పరుగులు పెడుతున్న శ్రీరాంసాగర్ నీరు

రెండు గ్రామాల్లో పోలీసుల దాడులు

- 180 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం
- నలుగురిపై కేసు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), సెప్టెంబరు15(ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండలం గర్జనపల్లి, మద్దిమల్లతండా గ్రామాల్లో ఎస్ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలోని పోలీసులు సోమవారం దాడులు నిర్వహించారు. పలు ఇళ్ల సమీపంలో సారా తయారీ కేంద్రాలను గుర్తించారు. నిల్వ చేసిన 180 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. సారా తయారీకి వినియోగించే క్వింటాలు ఇప్పపూవు, పాత్రలు, 18 లీటర్ల సారాను స్వాధీనపర్చుకున్నారు. తయారుదారులు రాములు, శంకర్, మంజుల, సుజాతలపై కేసు నమోదు చేశామని ఎస్ఐ లక్ష్మణ్ పేర్కొన్నారు. సారా తయారు, విక్రయాలు సాగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తమకు సమాచారం అందిస్తే వారివివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. గుడుంబా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ తమకు సహకరించాలని ఎస్ఐ లక్ష్మణ్ కోరారు. దాడుల్లో కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



స్వాధీనపర్చుకున్న సారా ముడిపదార్థాలు, నిందితుడితో ఎస్ఐ లక్ష్మణ్

ఇండియన్ పోస్టల్ రైల్వే రిజర్వేషన్ సిస్టమ్ సేవలను కొనసాగించాలి

కరీంనగర్ అర్బన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సెమీఅర్బన్, గ్రామీణ ప్రాంతాల ప్రజల సౌలభ్యం కోసం ఎంపిక చేసిన పోస్టాఫీసులు రైల్వే టికెట్ బుకింగ్ కౌంటర్లుగా పనిచేస్తున్నాయని, భారతీయ రైల్వేలు పోస్టల్‌శాఖతో సమన్వయంతో ప్రవేశపెట్టిన ఇండియన్ పోస్టల్‌రైల్వే రిజర్వేషన్ సిస్టమ్ (ఐపీఆర్ఆర్ఎస్) అనే సదుపాయాన్ని కొనసాగించాలని మంత్రి పొన్నం ప్రభాకర్, కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్‌కు లేఖ రాశారు. సిద్దిపేటజిల్లా హుస్నాబాద్ సబ్-పోస్టాఫీసులో గతంలో పనిచేస్తున్న ఐపీఆర్ ఆర్ఎస్ సౌకర్యాన్ని పోస్టల్‌శాఖ మూసివేసిందని, దీంతో సమీపంలోని పోస్టాఫీసులో రైలు టిక్కెట్లు బుక్ చేసుకోవడానికి ఈ సదుపాయాన్ని ఆశ్రయించిన రైతులు, కార్మికులు, విద్యార్థులు, సీనియర్ సిటిజన్లకు తీవ్ర అసౌకర్యం కలుగుతుందని లేఖలో పేర్కొన్నారు. రైల్వే టికెట్ బుకింగ్ కోసం సరసమైన, పారదర్శకమైన సులభంగా అందుబాటులో ఉండే హుస్నాబాద్ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ కేంద్రాన్ని తిరిగి ప్రారంభించాలని కోరుతున్నారన్నారు. ఈ సమస్యను కమ్యూనికేషన్ల మంత్రిత్వ శాఖ, పోస్టల్‌శాఖలోని సంబంధిత అధికారులతో చర్చించి, స్థానిక ప్రజల ప్రయోజనం కోసం హుస్నాబాద్ సబ్-పోస్టాఫీసులోని ఐపీఆర్ఆర్ఎస్ కేంద్రాన్ని వీలైనంత త్వరగా పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు.

కుక్కల దాడిలో ఏడుగురికి గాయాలు

మంథనిరూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాంధీచౌక్, అంబేద్కర్ చౌరస్తాలో సోమవారం కుక్కలు ఏడుగురిని గాయపరిచాయి. అంబేద్కర్, గాంధీచౌక్ ప్రాంతంలో షాపింగ్‌కు వచ్చిన వారిని కుక్కలు కరవడంతో తోట సాయి, చిందం సమీర్, రిషి, జంజర్ల జనార్దన్, కోట నరేందర్, కట్కుం స్వప్న, మాచీడి శ్రీధర్‌లకు గాయాలయ్యాయి. వారు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. ఈ నెలలో ఇప్పటి వరకు 99 మందిని కోతులు, కుక్కలు గాయపర్చగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యంతోనే యూరియా కొరత
- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

హుజూరాబాద్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్, డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించకపోవడంతో విద్యార్థులు రోడ్లపై పడుతున్నారన్నారని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం హుజూరాబాద్ పట్టణంలోని మధువని గార్డెన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు సంవత్సరాల ఫీజులు బకాయిలు పెడితే, కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా చెల్లించలేదన్నారు. ఎస్సీఎస్టీ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఫీజు చెల్లిస్తోందన్నారు. రాష్ట్రంలో 9వేల కోట్ల రూపాయల ఫీజులు పెండింగ్‌లో ఉండడంతో విద్యార్థులు సర్టిఫికెట్ల కోసం వెళ్లితే యాజమాన్యాలు ఆ డబ్బులు వసూళ్ల చేస్తున్నాయన్నారు. సాంఘిక, బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ స్కూళ్లలో డైట్ చార్జీలు ఆరు నెలలుగా ఇవ్వడం లేదన్నారు. సకాలంలో కాంట్రాక్టర్‌కు బిల్లులు ఇవ్వకపోవడంతో నాసిరకం వస్తువులను హాస్టళ్లకు సరఫరా చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కామారెడ్డిలో డిక్లరేషన్‌లో విద్యార్థులను ఆదుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వాలు మారిన పాత బకాయిలు కట్టాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వక పోవడంవల్ల విద్యార్థులతోపాటు, కళాశాలల్లో పనిచేసే సిబ్బంది కూడా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ప్రభుత్వం బాధ్యత రహిత్యంగా పనిచేస్తుందన్నారు. యూరియా కొరత రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం వల్లనే ఏర్పడిం దన్నారు. ఒక సీజన్ కంటే ముందే డీడీలు కట్టి, గోదాముల్లో స్టాక్ నిల్వ చేసుకోవాలి, కానీ ప్రభుత్వానికి ముందు చూపు లేకపోవడం తోనే కొరత ఏర్పడుతోందన్నారు. గ్రూప్-1 పరీక్షలో అవకతవకలు జరిగాయని, కొన్ని వందలసార్లు నిరుద్యోగులు రోడ్లపైకి వచ్చారన్నారు. ఒకటే పరీక్ష కేంద్రంలో వందమంది ఎంపికైతే మీ నిర్వహణ ఎట్లా ఉందో అర్థమైందన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు సక్రమంగా ఇవ్వకపోవడంతో తీవ్రఇబ్బందులు పడుతున్నారన్నారు. సమావేశంలో మాజీఎమ్మెల్యే బొడిగె శోభ, సంపత్ రావు, శ్రీరామ్, గౌతమ్‌రెడ్డి, కళాధర్, వెంకట్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, కరుణాకర్, సురేందర్‌రాజు, సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హుజూరాబాద్‌లో విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

కరీంనగర్ ప్రజావాణిలో హైడ్రామా

- తన భర్త వదిలి వెళ్లిపోయాడని, ఉద్యోగం ఇవ్వాలని నేలపై కూర్చుని మహిళ నిరసన
- కాసేపటికి ప్రత్యక్షమైన భర్త
- తాను బతికుండగానే చనిపోయానని సర్టిఫికెట్ తీసుకుందని ఆరోపణ

సుభాష్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో హైడ్రామా చోటు చేసుకుంది. కలెక్టర్ పమేలా సత్పతి ప్రజావాణి నిర్వహిస్తుండగా మానకొండూరు మండలం పోచంపల్లికి చెందిన భారతి అనే మహిళ దరఖాస్తు చేతపట్టుకొని వచ్చింది. తన భర్త తనను వదిలి వెళ్లిపోయాడని, తన భూమి ముంపునకు గురైందని తెలిపింది. తన దీన పరిస్థితిని చూసిన గత కలెక్టర్ తనకు ఉద్యోగావకాశం కల్పించాలని సూచించారని, తనకు ఉద్యోగం ఇప్పించాలని నేలపై కూర్చొని నిరసన తెలిపింది. పోలీసులు ఆమె వద్దకు చేరుకొని సమస్యను కలెక్టర్‌కు చెప్పుకోవాలని, కలెక్టర్ విచారణ జరిపి న్యాయం చేస్తారంటూ చెప్పారు. ఆమె వినకుండా పోలీసులతో వాగ్వాదానికి దిగింది. కొద్దిసేపు ఆమెతో మాట్లాడిన పోలీసులు చివరకు ఆమె నుంచి వినతిపత్రం స్వీకరించి అక్కడినుంచి బలవంతంగా బయటకు పంపించారు. కాసేపటికే భారతి భర్త పిల్లి రాజమౌళి ప్రజావాణికి వచ్చాడు. ఇప్పటి వరకు నిరసన తెలిపిన భారతి భర్త తానేనని అధికారులకు తెలిపాడు. తాను బతికుండగానే చనిపోయినట్లు తప్పుడు డెత్ సర్టిఫికెట్ పొంది భారతి వితంతు పెన్షన్ తీసుకుంటుందని చెప్పాడు. తమకు పెళ్లయి, పిల్లలు పుట్టిన తర్వాత తనను విడిచిపెట్టి వెళ్లిందన్నాడు. తనపై తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపించిందని తెలిపాడు. ఈ మధ్య కాలంలోనే తనకు తెలియకుండా తన తండ్రి నుంచి వచ్చి భూమిని ఆమె పేరుపై చేయించుకుందన్నాడు. ఇప్పుడు ఉద్యోగం కోసం అంటూ అధికారుల చుట్టూ తిరుగుతుందన్నాడు. కలెక్టర్ దీనిపై సమగ్ర విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కోరారు.





బైఠాయించిన భారతికి నచ్చజెప్పుతున్న పోలీసులు, భారతి భర్త రాజమౌళి

రహదారిపై కొండచిలువ హల్‌చల్..

హుజూరాబాద్ రూరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం తెల్లవారు జామున జమ్మికుంట-హుజూరాబాద్ ప్రధాన రహదారిపై కొండ చిలువ సంచరించడంతో గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. ప్రధానరహదారిపై ఆరు అడుగుల కొండ చిలువ కనిపించడంతో అటుగా వెళ్తున్న ప్రయాణికులు, గ్రామస్థులు ఆందోళనకు గురై వెంటనే అధికారులకు సమాచారం అందజేశారు. సుమారు రెండుగంటలపాటు శ్రమించి కొండచిలువను పట్టుకొని సురక్షిత ప్రాంతానికి తరలించడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.



ప్రధాన రహదారిపై సంచరిస్తున్న కొండ చిలువ

ఇసుక డంపు స్వాధీనం

తిమ్మాపూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపల్లి గ్రామంలో అక్రమంగా నిల్వఉంచిన భారీ ఇసుక డంపును ఎల్ఎండీ పోలీసులు, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా దాడిచేసి పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ మాట్లాడుతూ కొత్తపల్లి గ్రామశివారులో ఇసుకడంపు ఉన్నట్లు సమాచారంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌తోకలిసి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాదాపు 80ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక డంపు అక్రమంగా నిల్వ చేసినట్లు తెలిపారు. ఇసుకడంపును స్వాధీనం చేసుకొని తిమ్మాపూర్ తహసీల్దార్‌కు అప్పగించినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు.



ఇసుక డంపును పరిశీలిస్తున్న ఎల్ఎండీ ఎస్సై శ్రీకాంత్ గౌడ్

భారీ వర్షానికి కూలిన ఇల్లు

సైదాపూర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మకల్ గ్రామానికి చెందిన ఏలూరి లింగారెడ్డి, ఏలూరి ఆదిరెడ్డిలకు చెందిన ఇల్లు అయిదు రోజులక్రితం కురిసిన భారీవర్షానికి గోడలు తడిచి కూలిపోయింది. అధికారులు పరిశీలించి తమకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బాధితులు కోరారు.



బొమ్మకల్‌లో కూలిన ఇల్లు

మానసాదేవి ఆలయంలో సినీ నటి శ్రీలక్ష్మి


ఆలయంలో సినీ నటి శ్రీలక్ష్మి

గన్నేరువరం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాసింపేట మానసాదేవి అమ్మవారి సోమవారం సినీ హాస్య నటి శ్రీలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ముడుపును కట్టారు. అనంతరం ఆలయంలోని జంటనాగ శివలింగ ప్రతిమలకు జలాభిషేకం చేశారు. అమ్మవారి మహిమల గురించి తెలుసుకుని స్వయంగా దర్శించుకునేందుకు వచ్చినట్లు శ్రీలక్ష్మి తెలిపారు. ఆలయ అర్చకులు అమర్‌నాథ్‌శర్మ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మిని ఘనంగా సన్మానించి లడ్డూ ప్రసాదం, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

ఎస్సారార్‌లో బీఎస్సీ ఆనర్స్ కంప్యూటర్ సైన్స్‌లో పరిమిత సీట్లు

గణేశ్‌నగర్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ఆనర్స్ కంప్యూటర్ సైన్స్ బీఎస్సీ లైఫ్ సైన్స్ బీకాం రిటైల్ ఆపరేషన్ కోర్సుల్లో పరిమిత సంఖ్యలో సీట్లు ఉన్నాయని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.రామకృష్ణ అడ్మిషన్స్ కమిటీ కోఆర్డినేటర్ డాక్టర్ కె.సురేందర్ రెడ్డి, దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్.రామకృష్ణ తెలిపారు. దోస్త్ స్పాట్ అడ్మిషన్ల ద్వారా ప్రవేశం పొందడానికి మంగళవారం మాత్రమే అవకాశం ఉందని, విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

మిడ్ మానేరుకు కొనసాగుతున్న ఇన్ ఫ్లో



బోయినపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) శ్రీరాజరాజేశ్వర జలాశయానికి (మిడ్ మానేరు) ప్రాజెక్టు సోమవారం 9,950 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎస్సారెస్పీ నుంచి వరద కాలువ ద్వారా 7,450 మానేరు, మూలవాగు ద్వారా 2,500 క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉంది. అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 6,400, మల్కపేట రిజర్వాయర్‌కు 561 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 27.55 టీఎంసీలకు 27.196 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి కొనసాగుతున్న ఎత్తిపోతలు

ఇల్లంతకుంట : మండలంలోని అనంతగిరి గ్రామ సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి రెండు పంపుల ద్వారా నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. ఎగువన ఉన్న రంగనాయకసాగర్‌కు 6,60 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు.

సామాజిక చైతన్యమే లక్ష్యం

- సేవా కార్యక్రమాల్లో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు
- సైబర్ నేరాలు.. మహిళా సాధికారతపై గ్రామీణులకు అవగాహన


ఎన్ఎస్ఎస్ వలంటీర్ల బృందం

తంగళ్లపల్లి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సామాజిక చైతన్యమే లక్ష్యంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్‌లు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. మారుమూల గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల స్థితిగతులు పరిశీలిస్తూ వారి సమస్యలు తెలుసుకుంటున్నారు. మూఢ నమ్మకాలపై ప్రజలను చైతన్య పరుస్తూ తెలంగాణ గిరిజన మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు గుర్తింపును చాటుకుంటున్నారు.

గ్రామాల్లో సేవా కార్యక్రమాలు

విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాలపై అవగాహన పెంచుకోవడానికి ఎన్ఎస్ఎస్ శిబిరాలు వేదికలవుతున్నాయి. తంగళ్లపల్లి మండల కేంద్రంలోని గిరిజన మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన 50 మంది విద్యార్థులు మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో ఈ నెల 12వ తేదీ నుంచి జాతీయ సేవా కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. పది మందితో ఓ గ్రూప్‌గా ఐదు గ్రూపులుగా విడిపోయి సేవా కార్యక్రమాలు చేపట్టారు. గ్రామీణ ప్రజల్లో ఉన్న మూఢ నమ్మకాలను పారదోలుతూ అవగాహన కల్పిస్తున్నారు.

ప్లాస్టిక్‌కు స్వస్తి పలకండి

ప్లాస్టిక్‌కు స్వస్తి పలకాలని ప్రజలకు అవగాహన కల్పిస్తూ గ్రామంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు.


సర్వే చేస్తున్న వలంటీర్లు

శ్రమదానంతో చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేశారు. రోడ్డు పక్కన ముళ్ల పొదలను తొలగించారు. ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజా సమస్యలపై నివేదిక తయారు చేశారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ప్రతి మహిళ తన హక్కులను తెలుసుకుని ఆర్థికంగా, సామాజికంగా, విద్యారంగంలో ముందుండాలని తెలుపుతున్నారు. మహిళా సాధికారత గురించి వివరించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు నిర్వహించిన కార్యక్రమాలు గ్రామస్థులను ఆలోచింపజేసే విధంగా ఉంటున్నాయి.


ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న వలంటీర్లు

ఉత్సాహంగా సేవలందించారు

వాణీశ్రీ , ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్



శ్రమ అంటే ఏమిటో తెలియని విద్యార్థులు ఉత్సాహంగా, హుషారుగా సేవలందించారు. గ్రామంలో రోడ్లను ఊడ్చారు. ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. మురుగు కాలువల్లో పూడిక తీశారు. ఇలాంటి శిబిరాలు విద్యార్థులు సామాజిక సేవకులుగా ఎదగడానికి దోహదపడుతుంది.

సేవా భావం పెంపొందుతుంది

జయ, ప్రిన్సిపాల్, గిరిజన మహిళా డిగ్రీ కళాశాల



చదువుకునే దశలోనే విద్యార్థులకు ఈ శిబిరాలతో సేవా భావం పెంపొందుతుంది. ఎన్ఎస్ఎస్ శిబిరంలో నేర్చుకున్న విషయాలు గుర్తుండిపోతాయి. శ్రమ శిక్షణ, సామాజిక సేవ విద్యార్థుల్లో అలవడి భవిష్యత్తులో మంచి పౌరులుగా మార్గదర్శకులుగా నిలుస్తారు.

కొత్త విషయాలు నేర్చుకున్నాం

సంధ్య, ఎన్ఎస్ఎస్ వలంటీర్



శిబిరం ద్వారా ఎన్నో కొత్త విషయాలు తెలుసుకున్నాను. గ్రామంలో శ్రమదానంతో రోడ్లను శుభ్రపర్చడం సామాజిక బాధ్యతగా గుర్తించారు. వారంలో ఒకరోజు గ్రామంలోని యువత స్వచ్ఛందంగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టాలి.

చక్కని అనుభూతి ఇచ్చింది

ఆంజలీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్



ఎన్ఎస్ఎస్ శిబిరం చక్కని అనుభూతిని ఇచ్చింది. పది మదితో కలిసి పని చేయడంతో బిడియం పోయి నూతన ఉత్తేజాన్ని నింపింది. సేవా కార్యక్రమాలు చేయడానికి శిబిరం దారి చూపింది.

కొండగట్టులో ఉట్టి వేడుకలు


ఉట్టి వేడుకల్లో పాల్గొన్న అధికారులు, అర్చకులు

మల్యాల, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో సోమవారం ఉట్టి వేడుకలు నిర్వహించారు. కృష్ణాష్టమి అనంతరం నెల రోజులకు యేటా ఇక్కడ వేడుకలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఈవో శ్రీకాంత్‌రావు, పర్యవేక్షకులు సునీల్, చంద్రశేఖర్, ఆలయ స్థానాచార్యులు కపీందర్, ప్రధాన అర్చకులు రామకృష్ణ, జితేంద్రప్రసాద్, ఉప ప్రధాన అర్చకులు చిరంజీవి, భక్తులు పాల్గొన్నారు.

ధర్మపురిలో..


ధర్మపురిలో కృష్ణ భగవానుడికి ప్రత్యేక పూజలు

ధర్మపురి, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నృసింహస్వామి దేవాలయంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. వైష్ణవ కృష్ణాష్టమిని పురస్కరించుకుని ప్రధాన ఆలయంలోని బలరామకృష్ణుని వద్ద గల స్వామి వారికి ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

భక్తుల రక్షణకు పోలీసు శాఖ పటిష్ట చర్యలు

- సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా
- ట్రాఫిక్‌పై ప్రత్యేక నియంత్రణ
- ఎస్పీ మహేష్ బి. గితే


రాజన్న ఆలయ నమూన మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయానికి వచ్చే భక్తులకు పోలీసు శాఖ పటిష్ట చర్యలు చేపడుతుందని ఎస్పీ మహేష్ బి. గితే అన్నారు. రాజన్న ఆలయ సమావేశ మందిరంలో సోమవారం భక్తుల భద్రత, ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన ఏర్పాట్లపై వివిధ శాఖల సమన్వయంతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకు ముందు ఏఎస్పీ శేషాద్రినిరెడ్డితో కలిసి ఈవో రమాదేవి భీమేశ్వర ఆలయంలో చేపట్టి అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సమీక్ష సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ ఆలయానికి వచ్చే భక్తులకు భద్రతకు పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆలయాధికారులను ఆదేశించారు.

ఆలయ ప్రాంగణం, గోపుర ద్వారాలు, క్యూ లైన్‌లు, పార్కింగ్ ప్రదేశాలు, ప్రధాన వీధులలో సీసీ కెమెరాలను విస్తృతంగా అమర్చాలన్నారు. భక్తులు క్యూలైన్‌లలో ఎలాంటి ఇబ్బందులు పడకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తూ నిత్యం పర్యవేక్షణ చేయాలని సూచించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, ప్రధాన రహదారుల్లో డైవర్షన్‌ప్లాన్ సిద్ధం చేసి అమలు చేయాలని సూచించారు. పార్కింగ్ ప్రాంతాల్లో ప్రత్యేక సిబ్బందిని నియమించి, వాహనాలను క్రమబద్ధంగా నిలిపేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమావేశంలో ఏఎస్పీలు శేషాద్రినిరెడ్డి, చంద్రయ్య, ఈవో రమాదేవి పాల్గొన్నారు.

ఉద్యోగులను సన్మానించిన ఈవో రమాదేవి..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి ఆలయ ఇంజనీరింగ్ ఉద్యోగులను, సిబ్బందిని ఇంజనీర్స్ డే సందర్భంగా ఆలయ సమావేశ ఈవో రమాదేవి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు శ్రావణ్‌కుమార్, శ్రీనివాస్, జయకుమారి, అశోక్‌కుమార్ ఆలయ ఉద్యోగులు ఉన్నారు.

ప్రజలకు చేరువలో పాస్‌పోర్టు సేవలు

- ప్రతీ రోజు 500 స్లాట్స్ కల్పించేలా చర్యలు
- రాష్ట్ర ప్రభుత్వం స్థలమిస్తే శాశ్వత భవనం నిర్మిస్తాం
- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్
- అప్‌గ్రేడ్ పాస్‌పోర్ట్ కేంద్రం ప్రారంభం


కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్


కేంద్ర, రాష్ట్ర మంత్రులు బండి సంజయ్, పొన్నం ప్రభాకర్‌తో పాస్‌పోర్టు కార్యాలయ ఉద్యోగులు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): పాస్‌పోర్టు సేవలను ప్రధాని నరేంద్ర మోదీ సామాన్యుల దరి చేర్చారని, గతంలో పాస్‌పోర్ట్ పొందాలంటే నెలల తరబడి సమయం పట్టేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. సోమవారం కరీంనగర్‌లో ఆధునికీకరించిన అప్‌గ్రేడ్ పాస్ పోర్ట్ కేంద్రాన్ని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంతి బండి సంజయ్ మాట్లాడుతూ తెలంగాణలో కరీంనగర్‌తో సహా 5 పాస్ పోర్ట్ సేవా కేంద్రాలున్నాయన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో 2014లో కరీంనగర్ పాస్ పోర్టు సేవా కేంద్రం నుంచి సేవలు ప్రారంభమయ్యాయన్నారు.

పాస్ పోర్ట్ సేవల కోసం వచ్చే ప్రజల సౌకర్యార్థం 7 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న పార్క్యూన్ మాల్‌లో పాస్ పోర్టు కేంద్రాన్ని ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. కరీంనగర్ పాస్‌పోర్ట్ సేవా కేంద్రం ఇప్పటికే రోజుకు సగటున 230 స్లాట్లను నిర్వహిస్తోందని, ఈ సంఖ్యను 500కు పెంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్థలమిస్తే శాశ్వత భవనం కట్టించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కరీంనగర్ పాస్ పోర్ట్ సేవా కేంద్రాన్ని అప్ గ్రేడ్ చేయటం, ఆధునీకరించి, నూతనభవనంలోకి మార్చుకోగలిగామంటే అందుకు ప్రధాన కారణం తెలంగాణ రీజనల్ పాస్ పోర్టు అధికారి జొన్నలగడ్డ స్నేహజ సహకారమే అన్నారు. ఆమె అనేక సంస్కరణలు చేపట్టారన్నారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ పాస్ పోర్ట్‌సేవా కేంద్రం అప్‌గ్రేడేషన్ చేయడం సంతోషకరమన్నారు. 2009-14లో తాను పార్లమెంట్ సభ్యుడిగా ఉన్నప్పుడు పాస్ పోర్ట్ కార్యాలయాన్ని తీసుకొచ్చినట్లు చెప్పారు. సికింద్రాబాద్ పాస్‌పోర్ట్‌కి వెళ్తే ఉదయం 4 గంటలకు లైన్‌లో నిలబడాల్సి వచ్చేదని, ఇప్పుడు కరీంనగర్‌లో రీజనల్ పాస్ పోర్ట్ కార్యాలయం ద్వారా త్వరగా పాస్ పోర్ట్ పని పూర్తవుతుందని అన్నారు.

ఎమ్మెల్సీ అంజిరెడ్డి, రీజనల్ పాస్ పోర్ట్ ఆఫీసర్ స్నేహజ, పాస్ పోర్ట్ ఆఫీసర్, జాయింట్ సెక్రెటరీ, మాజీ మేయర్ సునీల్‌రావు, వాసాల రమేష్, మధుకర్, కొట్టె మురళి, బేతి మహేందర్‌రెడ్డి, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, ఆకారపు భాస్కర్‌రెడ్డి, వైద్యుల అంజన్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో రాజన్న సిరిసిల్ల జిల్లాకు పతకాలు


క్రీడాకారులను అభినందిస్తున్న ఎస్పీ

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగిన 12వ రాష్ట్ర స్థాయి సీనియర్స్ యోగా పోటీల్లో జిల్లాకు బంగారు, రజత, కాంస్య పతకాలు వచ్చాయి. సోమవారం రాష్ట్ర స్థాయి యోగా పోటీలలో మొత్తం 185 మంది క్రీడాకారులు పాల్గొనగా రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి ఎనిమిది మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 35 - 45 సంవత్సరాలలోపు విభాగంలో ఓరగంటి రామకృష్ణ బంగారు పతకం, 30 - 35 సంవత్సరాలలోపు విభాగంలో బి వినోద్ రజత పతకం, 18 - 21 సంవత్సరాలలోపు విభాగంలో పసుపుల ప్రణయ్ బంగారు పతకం, వీ సృజన 4వ స్థానంలో నిలిచారు. అక్టోబరులో చండీఘడ్‌లో జరిగే జాతీయస్థాయి సీనియర్ యోగా పోటీలలో వీరు పాల్గొనున్నారు. బంగారు, రజత పతకాలను సాధించిన రామకృష్ణ, వినోద్, ప్రనయ్, సృజనలను జిల్లా ఎస్పీ మహేష్ బీ. గీతే, అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, యోగ అసోసియేషన్ జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి అజ్మీరా రాందాస్,జిల్లా కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ అభినందించారు.

వేములవాడ ఆలయంపై స్పష్టత ఇవ్వాలి

బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రతాప రామకృష్ణ


మాట్లాడుతున్న ప్రతాప రామకృష్ణ

వేములవాడ, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం మూసివేతపై అధికారులు స్పష్టత ఇవ్వాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు ప్రతాప రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం ఆయన వేములవాడలో విలేకరులతో మాట్లాడుతూ ఆలయ అభివృద్ధిలో భాగంగా స్వామివారి అంతరాలయంలోని పరివార దేవతలను కదిలించడానికి అధికారులు సిద్ధమవుతున్నారని, అలాంటప్పుడు ఆలయ ఆవరణలోని దర్గా సంగతి ఏమిటో ముందుగా తేల్చాలని ఆయన డిమాండ్ చేశారు. హిందూ దేవతా విగ్రహాలను కదిలించి దర్గాను ముట్టుకోకుండా అలాగే ఉంచితే ఎట్టి పరిస్థితుల్లోనూ తాము ఊరుకోబోమని స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తర్వాత ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయశాఖ రాజన్న ఆలయ మూసివేతపై స్పష్టమైన ప్రకటన చేయలేదని, దసరా తర్వాత ఆలయాన్ని మూసి వేస్తారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఆలయాన్ని ఏ రోజు నుంచి మూసి వేస్తారో, ఎన్ని మాసాల్లో అభివృద్ధి పనులు పూర్తి చేసి తిరిగి ఆలయాన్ని భక్తులకు అందుబాటులోకి తీసుకువస్తారో ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరారు. రాజన్న ఆలయం మీద ఆధారపడి వేల కుటుంబాలు పరోక్షంగా జీవనోపాధి పొందుతున్నాయని, అధికారుల తీరు చూస్తే నాలుగైదు సంవత్సరాల పాటు అభివృద్ధి పనులు కొనసాగే విధంగా కనిపిస్తోందని, ఇలాగైతే ఆలయం మీద ఆధారపడి బతుకుతున్న వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. తాము అభివృద్ధికి వ్యతిరేకం కాదని అభివృద్ధి విషయంలోనే భక్తులకు, ప్రజలకు ప్రభుత్వం సరియైన స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. సమావేశంలో నాయకులు రేగుల మల్లికార్జున్, కృష్ణస్వామి ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- కార్మికుల వెల్ఫేర్ బోర్డు జీవో నంబరు 12ను సవరించాలి
- బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు జీవో నంబరు 12ను ప్రభుత్వం సవరించాలని బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రం శివనగర్ శివాలయం ఫంక్షన్ హాల్‌లో బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్(సీఐటీయూ అనుబంధం) జిల్లా మూడవ మహాసభకు ముఖ్య అతిథిగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులు దేశ అభివృద్ధిలో కీలక భూమిక పోషిస్తున్నారని అన్నారు. భవన నిర్మాణ రంగాన్ని నమ్ముకొని జీవిస్తున్న కార్మికుల సంక్షేమం కోసం చేపట్టిన అనేక ఐక్య పోరాటాల ఫలితంగా 1996లో భవన నిర్మాణ కార్మిక చట్టం ఏర్పడిందన్నారు. దేశ వ్యాప్తంగా వెల్ఫేర్ బోర్డు ద్వారా సంక్షేమ పథకాలను సాధించుకున్నామన్నా రు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతనంగా ప్రవేశ పెట్టిన విధానాల వలన కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కార్మికులకు సరియైన ఉపాధి లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వెల్ఫేర్ బోర్డు నిధులను పక్క దారి పట్టించే విధంగా వెల్ఫేర్ బోర్డు స్కీంలకు సంబంధించి ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పచెప్పే విధంగా తీసుకొచ్చిన జీవో నంబరు 12 వలన కార్మికుల తీవ్రంగా నష్టం జరుతుందన్నారు. సమస్య పరిష్కరించకుంటే రానున్న రోజుల్లో కార్మికలందరినీ ఐక్యం చేసి రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలను చేపడతామని హెచ్చరించారు.

అనంతరం మహాసభలో జిల్లాలో భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ ఉద్యమ పోరాటాలపై కార్యాచరణను రూపొందించుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, యూనియన్ జిల్లా అధ్యక్షుడు మిట్టపెల్లి రాజమల్లు, కార్యదర్శి ఎగమంటి ఎల్లారెడ్డి, కమిటి సభ్యులు బిక్షపతి, శ్రీదర్, శ్రీనివాస్, రాజెల్లయ్య, నరేందర్, ప్రభాకర్, వెంకటి, అశోక్, నరసింహులు, అంజయ్య, రాజు, రాములు, బాలవ్వ, నరసయ్య పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్

ఉధృతంగా ప్రవహిస్తున్న మానేరు వాగు


పదిర- రామలక్ష్మణపల్లి గ్రామాల మధ్య మానేరు వాగు

నిలిచిన రాకపోకలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్ మండలాల్లోని పదిర- రామలక్ష్మణపల్లి గ్రామాల మధ్య ఉన్న మా నేరు వాగు సోమవారం ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు రహదారిపై పొంగిపొర్లుతోంది. దాంతో ఆ రోడ్డు గుండా వెళ్లే గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. తహసీల్, పోలీసులు వాగు ప్రవాహాన్ని పరిశీలించారు. వాగు వద్ద అడ్డుగా గ్రామ పంచాయతీకి చెందిన ట్రాక్టర్‌ను నిలిపారు. ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. ఎవరూ వాగు ప్రవాహంలోకి వెళ్లకూడదని తహసీల్దార్ సుజాత, ఎస్ఐ రాహుల్‌రెడ్డి సూచించారు.

పాఠశాలలపై కరువైన పర్యవేక్షణ

(5వ పేజీ తరువాయి)

ప్రాధాన్యం ఇస్తారనే విమర్శలున్నాయి. వారు నిబంధనలను ఉల్లంఘించి పాఠశాలలను నడుపుతున్నా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవని విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. సమగ్ర శిక్ష నిధుల విషయంలో నిబంధనలను పాటించడం లేదని అకౌంట్స్ అధికారి ఏడాది క్రితం ప్రాజెక్టు అధికారికి నివేదిక సమర్పించినా ఎలాంటి చర్యలు లేకపోవడం గమనార్హం. ఈ ఏడాది జూన్ మొదటి వారంలో విద్యార్థి, యువజన సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట డీఈవో అక్రమాలపై విచారణ జరిపి సస్పెండ్ చేయాలని ఆందోళన చేపట్టారు. డీఈవోపై వచ్చిన ఆరోపణలపై రాష్ట్రస్థాయి అధికారులు జూలై 22న విచారణ జరిపి పూర్తిస్థాయిలో నివేదికను సమర్పించాలని ఆర్‌సీ నంబర్. 96/ఎస్ఇఆర్-1/2025 ద్వారా ఆర్‌జేడీని ఆదేశిస్తూ ఉత్తర్వులిచ్చినా ఆయన ఇప్పటి వరకు విచారణ జరపలేదు. జిల్లా విద్యాశాఖకు ప్రభుత్వం రెండు వాహనాలు కేటాయించగా, అందులో ఒకటి జిల్లా విద్యాశాఖాధికారి అధికార కార్యక్రమాల నిమిత్తం, మరొకటి సమగ్ర శిక్ష సమన్వయకర్తల క్షేత్రస్థాయి సందర్శనలకు వినియోగించాలని ఆదేశాలున్నాయి. రెండు కార్లను పెద్దపల్లి జిల్లాకు చెందిన వారి నుంచే అద్దెకు తీసుకోవాల్సి ఉండగా, ఒక కారు కరీంనగర్ జిల్లాకు చెందినది కావడం కొసమెరుపు. ఇప్పటికైనా రాష్ట్ర విద్యా శాఖాధికారులు స్పందించి జిల్లా విద్యా శాఖను ప్రక్షాళన చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

పెన్షన్లు పెంచాలని ఆందోళనలు

సుల్తానాబాద్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ దివ్యాంగులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన నిర్వహించారు. దివ్యాంగులు, వృద్ధులు, చేనేత, బీడీ కార్మికులు, వితంతువు తదితర పెన్షన్‌దారులు పాల్గొన్నారు. పెన్షన్ల పెంపునకు సీఎం ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. మండల ఇన్‌చార్జి దశరథం ఆధ్వర్యంలో జరగగా వీహెచ్‌పీఎస్ నాయకులు రఘుపతి, కుమారస్వామి, రాజయ్య, రాజమౌళి, శ్రీను, సంజీవ్, కుమార స్వామి, ప్రవీణ్, కనకం శంకర్, గంగారం పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్, (ఆంధ్రజ్యోతి): పెన్షన్ పెంచాలని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట వితంతువులు, దివ్యాంగులు ధర్నా నిర్వహించి తహసీల్దార్ జగదీశ్వర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అంబాల రాజేందర్ వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు రామ్మూర్తి, నాయకులు మంథని రామస్వామి, ధర్మ య్య, పద్మ, సరిత, సంపత్, మల్లమ్మ, కవితపాల్గొన్నారు.

ఎలిగేడు, (ఆంధ్రజ్యోతి): పెన్షన్లు పెంచాలని దివ్యాంగులు తహసీల్దార్ యాకయ్యకు వినతిపత్రాన్ని అందించారు. వికలాంగుల పెన్షన్లు రూ.4 వేల నుంచి రూ.6 వేలు, వృద్ధులు, వితంతువులు పెన్షన్ రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంచుతామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చి అమలు చేయడం లేదన్నారు. ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి తిప్పారపు లక్ష్మణ్, నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి కవ్వంపల్లి బాపయ్య, న్యాతరి పోచయ్య, వినోద్, మాజీ సర్పంచ్ రాచర్ల ఆర్‌కే రాజా, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, సదానందం, జల్లి రమేష్, కనకం రమేష్, అంజయ్య, లచ్చయ్య, పాల్గొన్నారు.

పాలకుర్తి, (ఆంధ్రజ్యోతి): పెన్షన్లు పెంచాలని ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ నాయకులు ఆందోళన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ జేరుపోతుల సునీతకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. ఎమ్మార్పీఎస్ మండల ఇన్చార్జ్ రాజేందర్‌కుమార్ మాదిగ, వీహెచ్‌పీఎస్ మండల ఇన్చార్జ్ పూసాల శంకరయ్య పాల్గొన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు మేర్గు నరేష్‌మద్దతు తెలిపారు.

మంథని, (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు కండరాల క్షీణత వారికి పెన్షన్ పెంచి ఇవ్వాలని తహసీల్దార్ కుమారస్వామికి వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షురాలు నరిగే మల్లేశ్వరి, మండల అధ్యక్షురాలు కల్వల స్వాతి, కడారి శ్రావణ్, జాడ దేవేందర్, గాజుల ప్రశాంత్‌లు వినతి పత్రాన్ని అందజేశారు.

పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి): ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో వృద్ధులు, వికలాంగులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ విజేందర్‌కు వినతిపత్రం అందించారు. ఎండీ గౌస్ పాషా, పెర్క సాగర్, ఉమారాణి, శంకర్, అంబాల నరేష్ పాల్గొన్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): పెన్షన్ పెంచాలనే ప్రధాన డిమాండ్‌పై దివ్యాంగులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్ సుమన్‌కు వినతి పత్రం అందజేశారు.

ధర్మారం, (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకారం పెన్షన్లు అందజేయాలని ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షుడు మద్దునాల మల్లేశం డిమాండ్ చేశారు. తహసీల్దార్ ఉదయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కాంపెల్లి చంద్రశేఖర్, సుమన్, గుమ్మడి రమేష్, దీకొండ సంధ్య తదితరులు పాల్గొన్నారు.

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): వికలాంగులు, వృద్ధులకు అందించే పింఛన్లను రాష్ట్ర ప్రభుత్వం పెంచాలని ఎంఆర్‌పీఎస్ నాయకుల ఆధ్వర్యంలో తహసీల్దార్ జక్కని స్వర్ణకు వినతిపత్రం ను అందజేసారు. నెరువట్ల రామస్వామి, సీపెల్లి అంజయ్య, పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్

ధర్మారం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో హిందీ భాష దినోత్సవాన్ని నిర్వహించారు. హిందీ భాష ప్రాముఖ్యత తెలిసేలా విద్యార్థులు చేసిన టీఎల్ఎం ప్రదర్శన ఆకట్టుకుంది. ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ హిందీని కేంద్ర ప్రభుత్వం అధికార భాషగా గుర్తించిందని తెలిపారు. ఉపాధ్యాయులు ముస్తఫా, ప్రసాద్, పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్, (ఆంధ్రజ్యోతి) : రాఘవపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో హిందీ భాషా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస, పద్య పఠనం, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రధానోపాధ్యాయులు హన్మంతు, ఉపాధ్యాయులు రమేష్, లక్ష్మీప్రసన్న, శ్రీకర్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): మౌలిక సదుపాయాలతో కార్పొరేషన్‌ను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నట్టు ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ తెలిపారు. సోమవారం హనుమాన్‌నగర్‌లో డ్రైనేజీ నిర్మాణం, సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కమిషనర్ అరుణశ్రీ, నాయకులు రాజేష్, మారెల్లి రాజిరెడ్డి, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు హాస్యాస్పదం



ఓదెలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సాగర్‌రెడ్డి

ఓదెల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) ఎమ్మెల్యే విజయరమణారావుపై రాజకీయ విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విదేశాల్లో తిరిగి వచ్చిన బీజేపీ నాయకులు సురేష్‌రెడ్డికి ఇక్కడి వ్యవసాయం, రైతుల బాధలు తెలియవన్నారు. నియోజకవర్గానికి యూరియా బస్తాలను ఇప్పించాడని తెలిపారు. మల్లన్న ఆలయ కమిటీ చైర్మన్ మొండయ్య, సింగిల్ విండో చైర్మన్ సుమన్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాహుల్, మాజీ ఎంపీటీసీ శంకర్, బైరి రవిందర్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు రాజయ్య, సామ శంకర్, పుప్పాల శంకర్, కుమారస్వామి, కొల్లూరి చందు, సామ మోహన్‌కుమార్, సమ్మిరెడ్డి, శ్రీనివాస్, పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ఏబీవీపీ కీలకపాత్ర

సుల్తానాబాద్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ఏబీవీపీ కీలకపాత్ర పోషిస్తుందని రాష్ట్ర కో కన్వీనర్ మారం సంపత్ అన్నారు. సుల్తానాబాద్‌లో సోమవారం ఏబీవీపీ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఎస్ఎఫ్‌డి రాష్ట్ర కోకన్వీనర్ మారం సందీప్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఏబీవీపీ 1949 జూలై 9న ఢిల్లీ కేంద్రంగా ప్రారంభమై విద్యార్థుల గొంతుకగా ఉద్యమాలు నిర్వహించిందన్నారు. విభాగ్‌హాస్టల్స్ కన్వీనర్ ప్రవీణ్ నగరకార్యవర్గాన్ని ప్రకటించారు.

పశుసంవర్ధక శాఖ ఏఐ వినియోగంపై అవగాహన

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏఐ వాడకం వల్ల పశుసంవర్ధక శాఖలో మెరుగైన రోగ నిర్ధారణ, చికిత్స సాధ్యమవుతాయని కలెక్టర్ కోయ శ్రీహర్ష పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో పశుసంవర్ధక శాఖలో ఏఐ టూల్స్ వినియోగంపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పశువుల వివరాలను అప్‌డేట్ చేయడం ద్వారా వాటికి సకాలంలో అందించాల్సిన మందుల వివరాలు ఏఐ గుర్తు చేస్తుందన్నారు. జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా. విజయ్ భాస్కర్, నీర్ సంస్థ సీఈవో జయ శంకర్,డా.రామ్ చందర్‌పాల్గొన్నారు.

క్యాంపు ఆఫీసు ఎదుట ధర్నా

మంథని, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడిలు ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసు ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. కనీస వేతనం రూ.18 వేలు, ఆన్‌లైన్ పని భారాన్ని తగ్గించాలని, ఎఫ్ఆర్ఎస్ రద్దు చేయాలని పీఏ చంద్రశేఖర్‌కు వినతి పత్రాన్ని ఇచ్చారు. గణేష్, సత్యవాణి, వనజారాణి, శ్యామల, పాల్గొన్నారు.

ప్రైవేట్ కళాశాలల బంద్ విజయవంతం



నిరసన తెలుపుతున్న విద్యార్థులు, మదర్‌థెరిస్సా కళాశాల ఎదుట ప్లకార్డులతో నిరసన

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు ఇచ్చిన బంద్ పిలుపులో భాగంగా సోమవారం జిల్లా కేంద్రంలోని పలు ఇంజనీరింగ్, ఫార్మసీ, డిగ్రీ, పీజీ, బీఈడీ, జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని నినాదాలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్లుగా బకాయిలను విడుదల చేయకుండా విద్యార్థులను, ప్రైవేటు యాజమాన్య విద్యాసంస్థలను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. గాయత్రి డిగ్రీ, పీజీ కళాశాలలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

పెద్దపల్లిరూరల్, (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్లుగా ఇంజనీరింగ్ కళాశాలలకు అందించే పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని నిరసిస్తూ పెద్దబొంకూర్‌లోని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలకు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ కళాశాల నిర్వహణ కోసం యజమాన్యాలు కోట్ల రూపాయలు అప్పు చేసి ఇప్పుడు నడవలేని పరిస్థితి ఉందన్నారు. పెండింగ్ రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ఫ్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు.

కోల్‌సిటీటౌన్, (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన ర్యాలీ చేపట్టారు. మార్కండేయకాలనీ నుంచి ప్రధానచౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణికుంట్ల ప్రీతం మాట్లాడుతూ బకాయిలను విడుదల చేయకుండా విద్యార్థుల భవిష్యత్‌తో ప్రభుత్వం ఆడుకుంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్ర చేస్తూ బకాయిలను విడుదల చేయడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి విద్యాశాఖపై ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. సాయి ఆజాద్, మాతంగి సాగర్, మహంకాళి లిటిల్, జశ్వంత్, అభిషేక్, సజన్ పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ఎలిగేడు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు నవసమాజ నిర్మాతలని ఎంపీడీఓ భాస్కర్‌రావు, ఎంఈవో అనసూరి నరేంద్రచారి అన్నారు. సోమవారం సుల్తాన్‌పూర్ ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సన్మానించారు. ఏఎంసీ చైర్మన్ భాగ్యలక్ష్మి, మాజీ సర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్ రావు, పాల్గొన్నారు.

కమాన్‌పూర్, (ఆంధ్రజ్యోతి): మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఎంఈవో, ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు విలువలతో కూడిన నైతిక విద్యను అందించాలన్నారు. జూలపల్లి హెచ్ఎం సుజాత, నాయకులు రమేష్, సదానందం, మల్లేశ్వరరావు, సతీష్, శంషోద్దీన్ పాల్గొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులు భరత్ కుమార్, నాగరాజు, శ్రవణ్ కుమార్, మల్లేశ్వరరావు, ఇస్మాయిల్, రాజనర్సు, కవిత, ప్రేమలత, సమ్మయ్య, సత్యనారాయణలను సన్మానించారు.

జూలపల్లి, (ఆంధ్రజ్యోతి): ఎమ్మార్సీ భవనంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను ఎంఈఓ సరస్వతి సన్మానించారు. ఆమె మాట్లాడుతూ ఉపాధ్యాయులు మరింత మెరుగైన ఫలితాల కోసం కృషిచేయాలన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులు నాగరాజు, పద్మ, రాజు,మాలతి, మమత, అశోక్‌రాజు, శ్రీనివాస్, రేక, ప్రవీన్, అంజయ్య, లక్ష్మయ్య ఉన్నారు.

అంతర్గాం, (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి తహసీల్దార్ తూము రవీందర్ పటేల్ ప్రశంస పత్రాలను అందజేశారు. ఎంఈవో ఏకాంబరం, ఉత్తమ ఉపాధ్యాయులు శ్రీనివాస్, శ్రీధర్, వసంత, మనెమ్మ, భాస్కర్‌రెడ్డి, రాజ్‌కుమార్ ఉన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికై కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులను ట్రస్మా ఆధ్వర్యంలో సన్మానించారు. శ్రీవాణి విద్యానికేత్ పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో అబ్బు కేశవరెడ్డి, మ్యాడద సమ్మిరెడ్డి, పుల్లూరి శారద, అన్నం లక్ష్మిలను ట్రస్మా సభ్యులు సన్మానించారు. టంగుటూరి రాజయ్య గూళ్ళ లక్ష్మణ్‌కుమార్, పాపిరెడ్డి, శ్రీనివాస్, యాదగిరి, ఓదేలు, పాల్గొన్నారు.

తరగతి గదులు త్వరగా నిర్మించాలి

అంతర్గాం, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సింగరేణి నిధులు రూ.2కోట్లతో నిర్మిస్తున్న అదనపు తరగతి గదుల పనులను సోమవారం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నాణ్యతతో కూడిన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. బాలరాజు, సలీం బేగ్, హరిప్రసాద్, శంకర్, గౌస్‌పాషా, పాల్గొన్నారు.

అభివృద్ధి ఓర్చుకోలేకే విమర్శలు

గోదావరిఖని, (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్, ఆ పార్టీ నాయకుడు కౌశికహరిలు అబద్ధాలకు అంబాసిడర్లుగా మారారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్, సీనియర్ నాయకుడు మహంకాళి స్వామి మాట్లాడారు. సీఎస్ఆర్ నిధులను కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు తరలించుకుపోతే చందర్ నోరుమెదపలేదన్నారు. రాజ్‌ఠాకూర్ ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత రూ.850కోట్లతో అభివృద్ధి చేస్తున్నారన్నారు. ప్రకాష్, శ్రీనివాస్, రాజేష్, పాల్గొన్నారు.

జీఎం కార్యాలయం ఎదుట సీఐటీయూ ధర్నా



జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు, కార్యకర్తలు

గోదావరిఖని, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఆర్-1 జీఎం కార్యాలయం ఎదుట నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి మాట్లాడుతూ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలు సొంత ఇంటి పథకం, అలవెన్సులు(పెర్క్స్)పై ఇన్‌కం ట్యాక్స్, మారుపేర్లు తదితర సమస్యలు పరిష్కరిస్తామని విఫలం అయ్యాయన్నారు. యాజమాన్యం ఇప్పటి వరకు లాభాలు ప్రకటించలేదు, కార్మికుల వాటా చెల్లించ లేదని, కాలనీలలో మంచినీరు, డ్రైనేజీ, శానిటేషన్, క్వార్టర్ల రిపేర్లు తదితర సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ప్రతినెల మెడికల్ బోర్డు నిర్వహించడం లేదని. సమస్యల పరిష్కారానికి సింగరేణి వ్యాప్తంగా ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే ఐక్య పోరాటాల ద్వారా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఆర్‌జీ-1 అధ్యక్ష కార్యదర్శులు ఆరెపల్లి రాజమౌళి, మెండె శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఆసరి మహేష్, దాసరి సురేష్, శంకరన్న, పెండం సమ్మయ్య, సానం రవి, నారాయణ, పీ శ్రీనివాస్, జంగాపల్లి మల్లేష్, శివరామిరెడ్డి, ఈదుల సాగర్, దుర్గా ప్రసాద్, ఎన్ రమేష్, వి సాగర్, పాల్గొన్నారు.



సింగరేణి రిటైర్డ్ కార్మికుల నిరసన



సింగరేణి పెన్షనర్ల ర్యాలీ

రామగిరి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సింగరేణి రిటైర్డ్ కార్మికుల ఆధ్వర్యంలో సోమవారం కలకత్తాలో జరుగుతున్న ధర్నాకు సంఘీబావంగా సెంటినరీకాలనీలోని పన్నూరు సెంటర్ నుంచి తెలంగాణ సెంటర్ వరకు సింగరేణి రిటైర్డ్ కార్మికులు ర్యాలీని చేపట్టారు. రిటైర్డ్ కార్మికులు పెన్షన్‌ను పెంచాలనే ప్రధాన డిమాండ్‌లపై ర్యాలీ చేపట్టారు. నాయకులు శంకరయ్య, మల్లయ్యగౌడ్, జవహర్, సత్యనారయణ, వంగరాజసమ్మయ్య, శేషు, జగదీశ్, ఐలయ్య, సలీం, రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రీడలకు సింగరేణి అధిక ప్రాధాన్యం

రామగిరి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. సోమవారం జీఎం కార్యాలయంలో వివిధ క్రీడలలో విజేతలుగా నిలిచి, రీజియన్ స్థాయి క్రీడలలో పాల్గొన్న వివిధ గనులు, విభాగాలకు చెందిన క్రీ డాకారులకు క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. ఏపిఏ జీఎం నాగేశ్వర్‌రావు, గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు రామచంద్రరెడ్డి, కోటరవీందర్‌రెడ్డి, అధికారులు రామ్మోహన్, సుదర్శనం, సురేఖ, స్పోర్ట్స్ గౌరవ కార్యదర్శి సాయి స్వరూప్, కో-ఆర్డినేటర్ జవ్వాజీ అంజయ్య పాల్గొన్నారు.

గోదావరిఖని, (ఆంధ్రజ్యోతి): ఆర్‌జీ-1 ఏరియా వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ (డబ్ల్యూపీఎస్‌జీఏ) ఆధ్వర్యంలో వివిధ క్రీడలలో ఎంపికైన క్రీడాకారులకు జీఎం లలిత్ కుమార్ క్రీడాకారులకు దుస్తులను అందజేశారు. క్రీడల వలన పట్టుదల, క్రమశిక్షణతో కృషి చేస్తే మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. ఏఐటీయూసీ డిప్యూటీ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, ఇన్‌చార్జి ఎస్ఓటూ జీఎం రమేష్, ఏజెంట్ శ్రీనివాస్, పీఓ రమేష్, డీవైపీఎం వేణు, సీనియర్ పీఓ హనుమంతరావు, స్పోర్ట్స్ సూపర్ వైజర్ రమేష్, కోఆర్డినేటర్ సత్యనారాయణ, జాన్ కెనడి, సంపత్, పాల్గొన్నారు.

వృత్తి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గోదావరిఖని, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సింగరేణి సేవా సమితి, రామగుండం ఏరియా-1 ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతులకు, మహిళలకు వృత్తి శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్‌జీ-1 అధికార ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. టైలరింగ్, బ్యూటీషియన్, ఫ్యాషన్ డిజైనింగ్, మగ్గం వర్క్స్, స్పోకెన్ ఇంగ్లీష్, క్లాత్, జూట్, బంజారా బ్యాగ్స్ వివిధ వృత్తి శిక్షణా తరగతులను నిర్వహించి ధ్రువీకరణ పత్రాలను అందజేస్తామన్నారు. ఉచితంగా తేనెటీగల పెంపకంపై శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఆధార్ కార్డ్, సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలు, రెండ్ పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలతో సమీప కార్యాలయాలు, సంక్షేమాధికారి కార్యాలయంలో సంప్రదించాలని పర్సనల్ విభాగం, జీఎం కార్యాలయం ఆర్‌జీ-1లో ఈ నెల 30వ తేదీలోగా అందజేయాలని సూచించారు.

ఏఐటీయూసీ ఎల్లప్పుడు కార్మికుల పక్షమే

యైటింక్లయిన్‌కాలనీ, (ఆంధ్రజ్యోతి): ఏఐటీయూసీ ఎల్లపుడూ కార్మిక పక్షపాతమేనని యూనియన్ నాయకులు తెలిపారు. సోమవారం ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో సెంట్రల్ సెక్రెటరీ ఎల్ ప్రకాష్ మాట్లాడారు. గుర్తింపు సంఘంగా గెలిచిన తర్వాత సింగరేణి వ్యాప్తంగా జరిగిన పనులు కాకుండా ఏరియా పరిధిలో దాదాపు 40కిపైగా కార్మికులకు ఉపయోగకరమైన పనులు ఆర్జీ-2 యాజమాన్యాన్ని ఒప్పించి చేసినట్టు తెలిపారు. ఉద్దేశపూర్వకంగా కొందరు ఏఐటీయూసీని విమర్శించడం మానుకోవాలన్నారు. రాజారత్నం, జిగురు రవీందర్, అన్నారావు, మహేందర్, రవికుమార్, బుర్ర తిరుపతి, తాళ్ళపల్లి నారాయణ, కుమారస్వామి, మదన్‌మోహన్, కొండ్ర సత్యనారాయణ పాల్గొన్నారు.

లాభాల వాటా ప్రకటించాలి

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): 2024-25 ఆర్థిక సంవత్సర లాభాలను ప్రకటించాలని, 35 శాతం సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆర్జీ-2 సెక్రెటరీ కుంట ప్రవీణ్ డిమాండ్ చేశారు. సోమవారం సీఎం ఆఫీస్ ఎదుట నిరసన తెలిపిన అనంతరం అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్ సంస్థల నుంచి రావాల్సిన 42 వేల కోట్ల బకాయిలు చెల్లించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలని, ఆపరేటర్లకు పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు బ్యాక్ డేట్‌తో ఇవ్వాలని, ప్రతి నెల మెడికల్ బోర్డు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బానోతు వినయ్, సోమారపు వెంకన్న, సంపత్, రాంప్రసాద్, భూమయ్య, లక్ష్మీరాజం, సాంబరావు, శ్రీహరి, సారంగం, వినేష్, శ్రావణ్ పాల్గొన్నారు.

గనుల్లో ఫ్రంట్‌లైన్ సూపర్‌వైజర్ల పాత్ర కీలకం

రామగిరి, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): గనులలో ఫ్రంట్‌లైన్ సూపర్‌వైజర్ల పాత్ర కీలకమని ఆర్జీ-3,ఏపిఏ జీఎంలు సుధాకర్‌రావు, నాగేశ్వర్ రావులు అన్నారు. సోమవారం ఆర్జీ-3,ఏపిఏ డివిజన్‌లలో 30 రోజుల పాటు నిర్వహించి ఎంవిటిసి శిక్షణ కార్యక్రమానికి జీఎంలు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. సహచర ఉద్యోగులకు భద్రతతో కూడిన విధులు నిర్వహించేలా ప్రోత్సాహించాలని సూచించారు. మేనేజర్ సుజీత్, శ్రీనివాస్, శిక్షకులు పాల్గొన్నారు.

ఘనంగా ఇంజనీర్స్ డే

గోదావరిఖని, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): ఇంజనీర్ సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఆర్‌జీ-1 జీఎం కార్యాలయంలో సోమవారం ఇంజనీర్స్ డే నిర్వహించారు. జీఎం లలిత్‌కుమార్ విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అధికారులు శివనారాయణ, రామదాస్, రమేష్, రవీందర్‌రెడ్డి, వరప్రసాద్, సాయి ప్రసాద్, మల్లేష్, సాంబశివ రావు, అశోక్ రావు, హనుమంతరావు పాల్గొన్నారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): ఇంజనీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలను జరుపుకున్నారు జీఎం సుధాకర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

రామగిరి, (ఆంధ్రజ్యోతి): ఇంజనీర్స్ డేను పురస్కరించుకొని సింగరేణి సంస్థ ఆర్జీ-3,ఏపిఏ డివిజన్‌లలో పనిచేసే ఇంజనీర్స్‌ను లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మేకల మారుతీ ఆధ్వర్యంలో సన్మానించారు. క్లబ్ డైరెక్టర్‌లు వెంకటరమణరెడ్డి, బెల్లంశ్రీనివాస్, ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు కోటరవీందర్‌రెడ్డి, నాయకులు ఉడుత శంకర్, శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

19న టాస్క్ కేంద్రంలో జాబ్ మేళా

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగ యువకులకు టెలిపెర్ఫార్మెన్స్ ప్రైవేటు కంపెనీ లిమిటెడ్‌లో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 19న శుక్రవారం పాత ఎంపీడీవో ఆవరణలోని టాస్క్ కేంద్రం వద్ద జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష సోమవారం తెలిపారు. టెలిఫెర్మార్మెన్స్ ప్రైవేటు కంపెనీలో 2022 నుంచి 2025 వరకు డిగ్రీ, బీటెక్ పూర్తి చేసిన విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు తమ సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో టాస్క్ సెంటర్‌లో హాజరు కావాలని ఆయన తెలిపారు. వివరాలకు 9059506807 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే సంబరాలు



విద్యార్థినుల సాంస్కృతిక ప్రదర్శన

సుల్తానాబాద్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే సంబరాలు సోమవారం నిర్వహించారు. విద్యార్థులు ఆటాపాటలతో కళాశాల ప్రాంగణాన్ని హోరెత్తించారు. జాతీయ, రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపిన విద్యార్థులు పార్థు, ప్రకాష్, అలాగే ఇంటర్ ద్వితీయలో అత్యుత్తమ మార్కులు సాధించిన నవీన్, అభిషేక్, విజయ్, నందిని, సిద్ధార్థలను ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి కల్పన సన్మానించారు. రాష్ట్రస్థాయి మిమిక్రీ ఆర్టిస్టు రాజ్‌కుమార్ ప్రదర్శన ఆకట్టుకొంది. ప్రిన్సిపాల్ శ్రీధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ఎలిగేడు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): నర్సాపూర్‌లో సోమవారం కూనారం వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త సతీష్ చంద్ర రైతులకు వరి పంటలో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను వివరించారు. కాండం తొలుచు పురుగు, లింగాకర్షక బుట్టలను 25 మంది రైతులకు ఎకరానికి నాలుగు చొప్పున అందించారు. మండల వ్యవసాయ అధికారి ఉమాపతి, పీఏసీఎస్ చైర్మన్ గోపు విజయభాస్కర్ రెడ్డి, ఏఈఓలు గణేష్, సురేష్, శరణ్య పాల్గొన్నారు.

తహసీల్దార్‌ను కలిసిన రేషన్ డీలర్లు

ఎలిగేడు, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లు తహసీల్దార్ యాకయ్య, డిప్యూటీ తహసీల్దార్ సిరిపురం గిరిని సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పలు డిమాండ్లను వివరించి వాటి సాధనకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఐట్ల రమాదేవి శ్రీనివాస్, అశోక్‌రావు, తిరుపతి, రాజయ్య, శంకర్, శ్యామల, బాపు, రాజమ్మ, సరిత రవీందర్ రెడ్డి, సమ్మయ్య, లక్ష్మి రాజాం పాల్గొన్నారు.

కరాటేతో ఆత్మవిశ్వాసం

కోల్‌సిటీటౌన్, సెప్టెంబర్ 15(ఆంధ్రజ్యోతి): కరాటేతో మానసిక ధైర్యం, ఆత్మవిశ్వాసం, శారీరక ధృడత్వం పెంపొందుతాయని పలువురు పేర్కొన్నారు. సోమవారం గోదావరిఖని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జపాన్ షిటోరియో కరాటే స్కూల్ తెలంగాణ స్టేట్ చీఫ్ బెల్ట్ ఎగ్జామినర్ కరాటే శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. జపాన్ షిటోరియో రాష్ట్ర అధ్యక్షుడు తగరపు శంకర్, కాంగ్రెస్ నాయకులు గట్ల రమేష్, ముస్తఫా మాట్లాడారు. ఆడపిల్లలు కరాటేను నేర్చుకోవాలన్నారు. అనంతరం బెల్ట్ గ్రేడింగ్‌లు, సర్టిఫికెట్లు అందజేశారు. స్టేట్ కార్యదర్శి ఎం.రమేష్, కోశాధికారి శ్రీనివాస్, సీనియర్ ఇన్‌స్ట్రక్టర్స్ శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, రోమిత్ కుమార్, సృష్టి, శైలజ, సంజన, అభిజ్ఞ, శుభశ్రీ, పాల్గొన్నారు.

కరాటేలో నిహారికకు స్వర్ణ పతకం

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): వెన్నంపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న నిహారిక ఇటీవల కరీంనగర్‌లో జరిగిన దక్షిణ భారత ఓపెన్ కరాటే పోటీల్లో స్వర్ణ పతకం సాధించింది. ఈ మేరకు సోమవారం నిహారికను హెచ్ఎం రామేశ్వర్, కరాటే మాస్టర్ కలువల రమేష్ తదితరులు అభినందించారు.

సింగరేణి మెడికల్ ఆఫీసర్‌కు సన్మానం

కోల్‌సిటీటౌన్, సెప్టెంబరు 15(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రి డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పి.ప్రసన్నకుమార్‌ను ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం, ఆలయ ఫౌండేషన్ నాయకులు సన్మానించారు. సోమవారం ఆసుపత్రిలో డీవైసీఎంవోగా పదోన్నతి పొంది బాధ్యతలు స్వీకరించగా నాయకులు పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. లక్ష్మణ్, బొంకూరి మధు, రాజేష్, మిట్టపల్లి రాజేందర్‌కుమార్, వెంకటేశ్వర్లు, పానుగంటి రాజలింగం, కొంకటి వెంకటేష్, సిద్ధార్థ, మహేష్, పాల్గొన్నారు.

రచ్చపల్లి పాఠశాలలో ఫ్రూట్స్ డే



ఫ్రూట్స్‌డే వేడుకల్లో విద్యార్థులు

ధర్మారం, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రచ్చపల్లి ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో ఫ్రూట్స్‌డే వేడుకలను నిర్వహించారు. పాఠశాలలోని ఒకటి, రెండు తరగతుల విద్యార్థులతో వారి తల్లిదండ్రుల సమక్షంలో పండ్లకు సంబంధించిన ఆటలు, కృత్యాలు చేయించారు. ఫ్రూట్స్ డే సందర్భంగా విద్యార్థులు ఆడిన ఆటలు వారి తల్లిదండ్రులను ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వంశీ మోహనాచార్యులు, ఉపాధ్యాయుల సంపత్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్లు అభివృద్ధి చేయాలని ఎంపీకి వినతి

ఓదెల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్ల అభివృద్ధికి కృషి చేయాలని సోమవారం మంచిర్యాలలో ఎంపీ వంశీకృష్ణకు కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం అందించారు. నాయకులు మాట్లాడుతూ ఓదెల, పొత్కపల్లి, కొలనూర్ రైల్వేస్టేషన్‌లలో కనీస సౌకర్యాలు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మూడు రైల్వేస్టేషన్‌లలో గేట్‌ల నుంచి హైలెవెల్ రోడ్డు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండేటి ఐలయ్య యాదవ్ పాల్గొన్నారు.

సీపీఐ బైక్‌ర్యాలీ

ఓదెల, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ పోరాటానికి బీజేపీ మతం రంగు పూసి లబ్ధి పొందే కుట్ర పన్నిందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాళ్లపల్లి లక్ష్మణ్ అన్నారు. సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈనెల 17 విలీన దినోత్సవాన్ని ప్రతీ గ్రామంలో నిర్వహించాలని కోరారు. పొత్కపల్లిలో జెండాను ఆవిష్కరించారు. కోడెం స్వామి, రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్నారు.

డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై విస్తృత ప్రచారం చేయాలి

పెద్దపల్లిటౌన్, సెప్టెంబరు 15 (ఆంధ్రజ్యోతి) జిల్లాలో మాదక ద్రవ్యాలు, డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై విస్తృత ప్రచారం కల్పించాలని అదనపు కలెక్టర్ డి.వేణు అధికారులను ఆదేశించారు. సోమవారం డ్రగ్స్ నియంత్రణపై సమావేశాన్ని నిర్వహించారు. శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై చర్చించారు. గోదావరిఖని ఆసుపత్రిలో డీఅడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. జిల్లా విద్యాధికారి మాధవి, బీసీ వెల్ఫేర్ అధికారి రంగారెడ్డి, ఆర్డిఓ గంగయ్య, ఏసిపి జి. క్రిష్ణ, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రకాష్, పాల్గొన్నారు.